# సుపరిపాలన అందించే ప్రభుత్వాన్ని ఆదరించాలి

## కల్లబొల్లి మాటలు చెప్పే పార్టీలను తిరస్కరించాలి

- రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుతున్న సీఎం కేసీఆర్
- అభివృద్ధి పనులు శాశ్వతం.. నేను శాశ్వతం కాదు..
- నియోజకవర్గంలో 50 ఏండ్లవరకు విద్యుత్, సాగునీటికి ఢోకాలేదు
- సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి
- బాన్సువాడ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న స్పీకర్



జక్కల్‌దానితండాలో జీపీ భవన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ/బాన్సువాడ రూరల్, అక్టోబర్ 6 : బాన్సువాడ నియోజక వర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులు శాశ్వతంగా ఉంటాయని, కానీ తాను శాశ్వతంగా ఉండనని సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం తండాలను పంచాయతీలుగా మార్చడంతో గిరిజన తండాల రూపురేఖలు మారిపోయాయన్నారు. శుక్రవారం ఆయన బాన్సువాడ, బాన్సువాడ మండలంలోని జక్కల్‌దాని తండాలో పర్యటించారు. జక్కల్‌దాని తండాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. బాన్సువాడలోని పీఆర్ గార్డెన్‌లో మున్నూరుకాపులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో స్పీకర్ మాట్లాడుతూ.. మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనానికి రాకుండా కొంత మంది ఆయా గ్రామాల్లో ఆపడానికి ప్రయత్నించారని తెలిపారు. మున్నూరు కాపులను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామన్నారు. కాపు బిడ్డ కాళ్లకు ముళ్లు గుచ్చితే తన పంటితో తీస్తానని అన్నారు. దుర్మార్గం చేస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉత్తర తెలంగాణ జిల్లాలోని 50 లక్షల ఎకరాల్లో రెండు పంటలకు సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. కాళేశ్వరం జలాలతో నిజాంసాగర్ నిండుకుండలా మారిందన్నారు. రాబోవు 50 ఏండ్ల వరకు విద్యుత్, సాగునీటి ఇబ్బందులు ఉండవన్నారు. నీరు వృథా కాకుండా మంజీరలో బాన్సువాడ వద్ద రూ.15 కోట్లు, బీర్కూర్ వద్ద రూ.30 కోట్లు, కొడిచెర్ల వద్ద రూ.70 కోట్లు, సుంకిని వద్ద రూ.30 కోట్లతో చెక్‌డ్యాంలు నిర్మించినట్లు వివరించారు. బాన్సువాడ నియోజకవర్గంలో రెండు పంటలకు ఎల్లవేళలా సాగునీరు అందించాలన్నది తన లక్ష్యమన్నారు.

**మూడోసారి సీఎం కేసీఆరే..**

ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రంలోనే బాన్సువాడ నియోజకవర్గం నంబర్‌వన్ స్థానంలో ఉందని చెప్పారు. రాబోవు రోజుల్లో మరోసారి ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సీఎం అవుతారని అన్నారు. అందరి ఆశీర్వాదంతో తాను మళ్లీ బాన్సువాడ ఎమ్మెల్యేగా ఉంటానని అన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని 69 గిరిజన తండాల్లో గూడు లేని నిరుపేదలందరికీ గూడు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 11వేల డబుల్‌బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేస్తే అందులో 2570 ఇండ్లు గిరిజనులకు ఇచ్చినట్లు చెప్పారు. తండాలను పంచాయతీలుగా మార్చడంతో గిరిజన బిడ్డలకు పరిపాలన చేసే అధికారం దక్కిందని అన్నారు. ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పోడు పట్టాల సమస్యలను పరిష్కరించి అర్హులైన గిరిజనులందరికీ పోడు పట్టాలు అందించినట్లు తెలిపారు. అర్హులైన మిగితా వారికి పోడు పట్టాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. సుపరిపాలన అందించే ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. కల్లబొల్లి మాటలు, ఉత్తుత్తి హామీలతో ప్రజలను మభ్యపెట్టే పార్టీలను తిరస్కరించాలని అన్నారు. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు.

# మాట నిలబెట్టుకున్న కేసీఆర్ సర్కారు



ఇంటిని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, మలావత్ పూర్ణ, కుటుంబ సభ్యులు

- సొంతింటి కల పరి'పూర్ణ'ం
- ఎవరెస్ట్‌ను అధిరోహించిన పూర్ణకు ఇల్లు కట్టిస్తామని గతంలో హామీ
- కామారెడ్డిలో నిర్మించి ఇచ్చిన ప్రభుత్వం
- ప్రారంభించిన ప్రభుత్వ విప్ గోవర్ధన్

కామారెడ్డి, అక్టోబర్ 6: కేసీఆర్ ప్రభుత్వం మాట నిలబెట్టుకున్నది. సొంతింటి కలను పరి'పూర్ణ'ం చేసింది. ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించిన మలావత్ పూర్ణకు కామారెడ్డిలో ఇల్లు కట్టించి ఇచ్చింది. నిర్మాణం పూర్తి కావడంతో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ శుక్రవారం ప్రారంభించారు. మలావత్ పూర్ణది నిరుపేద గిరిజన కుటుంబం. ఎక్కడో మారుమూల తండాకు చెందిన ఆమె.. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. కేసీఆర్ సర్కారు తీసుకొచ్చిన గురుకుల పాఠశాలలో చేరిన పూర్ణ జీవితం పూర్తిగా మారింది. ప్రభుత్వ చేయూత, ఉన్నతాధికారుల ప్రోత్సాహంతో పర్వతారోహణలో శిక్షణ పొందింది. 2014లో కఠోర ప్రయాణాన్ని అధిగమించి ప్రపంచంలో ప్రఖ్యాతిగాంచిన మౌంట్ ఎవరెస్ట్‌ను అధిరోహించింది. అతిచిన్న వయస్సులోనే ఈ పర్వతాన్ని ఎక్కిన రికార్డును ఆమె సొంతం చేసుకుంది. ఈ క్రమంలో మలావత్ పూర్ణను ఘనంగా సత్కరించిన సీఎం కేసీఆర్.. ఆమెకు జాగాతో పాటు ఇల్లు కూడా కట్టిస్తామని ప్రకటించారు. ఇచ్చిన మాట మేరకు పూర్ణ కోరిన విధంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్డులో 300 గజాల స్థలంలో రూ.47 లక్షల వ్యయంతో రాష్ట్రం ప్రభుత్వం నిర్మించింది. ఇటీవలే నిర్మాణం పూర్తి కాగా శుక్రవారం గృహప్రవేశం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం ఇంటిని నిర్మించి ఇచ్చారని తెలిపారు. మలావత్ పూర్ణ కుటుంబ సభ్యులతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందుప్రియ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపిగౌడ్, గంద్ర మధుసూదన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# కేసీఆర్ సహకారంతో అద్భుత ప్రగతి

- నియోజకవర్గంలో అద్వితీయమైన అభివృద్ధి
- రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- బాల్కొండలో ఫైర్ స్టేషన్‌ను ప్రారంభించిన వేముల



ఫైర్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ, అక్టోబర్ 6 : సీఎం కేసీఆర్ సహకారంతో బాల్కొండ నియోజకవర్గంలో అద్వితీయమైన అభివృద్ధి జరిగిందని రాష్ట్ర రోడ్లు-భవనాలు, గృహ నిర్మాణశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన అగ్నిమాపక కేంద్రాన్ని శుక్రవారం మంత్రి ప్రారంభించగా.. హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వేముల మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా ఒక్క బాల్కొండ నియోజకవర్గంలోనే 20 సబ్‌స్టేషన్లు, రూ. వెయ్యి కోట్లతో రోడ్లు, బ్రిడ్జిలు, గోదాములు నిర్మించినట్లు తెలిపారు. కేసీఆర్ తనపై చూపింపే ప్రేమను బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఉపయోగిస్తున్నానని, తన స్వార్థానికి వాడుకోవట్లేదని స్పష్టం చేశారు. ప్రజలు ఆలోచన చేయాలని, కేసీఆర్‌ను, తనను ఆశీర్వదించాలని కోరారు. నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రమాదాలు సంభవిస్తే వెంటనే స్పందించి నష్టాన్ని నివారించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఫైర్‌స్టేషన్ వారు ఏర్పాటు చేసిన బుక్‌లో సందేశం రాయాలని చెప్పగా.. 'ఫైర్‌స్టేషన్ అవసరం రావొద్దు.. ఒకవేళ వస్తే అత్యంత మెరుగైన సేవలందించాలి' అని రాసినట్లు వేముల తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లావణ్య, జడ్పీటీసీ లావణ్య, సర్పంచ్ బూస సునీత, బీఆర్ఎస్ మండల నాయకులు బద్దం ప్రవీణ్‌రెడ్డి, రైతు నాయకుడు కె.నర్సింహానాయుడు, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో సంతోష్ కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీటీసీలు, వీడీసీ సభ్యులు, జిల్లా ఫైర్ సేఫ్టీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో నాణ్యమైన విద్య

- విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక దృష్టి
- రూ. కోట్లతో సౌకర్యాల కల్పన
- ఎమ్మెల్యే జాజాల సురేందర్
- ఎల్లారెడ్డి గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో అభివృద్ధి పనుల ప్రారంభం



బాలికలకు క్రీడాకిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 6: స్వరాష్ట్రంలో గిరిజన బాలబాలికల కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం గురుకుల, రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నదని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో డార్మెటరీ గదులు, కిచెన్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి రూ. కోట్లు వెచ్చిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు జీవితంలో స్థిరపడి, ఉన్నతస్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సమైక్య పాలనలో వసతి గృహాల్లో సరైన సౌకర్యాలు ఉండేవికాదని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పరిస్థితి మారిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం నాణ్యమైన చదువు, పోషకాహారం, మంచి వాతావరణం, అధునాతన సౌకర్యాలతో గురుకుల పాఠశాలలను ఏర్పాటుచేసిందని చెప్పారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని మంచి మార్కులు సాధించాలని సూచించారు. అనంతరం పాఠశాలకు చెందిన క్రీడాకారులకు రాష్ట్రం ప్రభుత్వం సరఫరాచేసిన క్రీడాకిట్‌లను జాజాల అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కాశీనారాయణ, జడ్పీటీసీ ఉషాగౌడ్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, నాయకులు శ్రావణ్‌కుమార్, నునుగొండ శ్రీనివాస్, బాల్‌రాజ్‌గౌడ్, ఎరుకల సాయిలు, మత్తమాల సర్పంచ్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

## రామారెడ్డి మండలంలో..

రామారెడ్డి, అక్టోబర్ 6: రామారెడ్డి మండల కేంద్రంతోపాటు ఇసన్నపల్లి, ఉప్పల్‌వాయి, కన్నాపూర్, గోకుల్‌తండా, గొల్లపల్లి తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే జాజాల శుక్రవారం పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి , స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అంతకుముందు కాలభైరవస్వామిని దర్శించుకొన్నారు. అనంతరం ఇసన్నపల్లి గ్రామంలో విద్యార్థులకు అల్పాహారం వడ్డించారు. రామారెడ్డిలో ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. పోసానిపేట్ గ్రామంలో యువకులకు స్పోర్ట్స్ కిట్‌లను అందజేశారు. అనంతరం గొల్లపల్లి, గోకుల్‌తండాలో పంచాయతీ భవనాలను ప్రారంభించారు. సర్పంచులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉప్పల్‌వాయి మోషంపూర్ రోడ్డు పనులను ప్రారంభించారు.



ఇసన్నపల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్